డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM
DYNAMIC JANAMVOICE
HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR

విలేకరులు కావలెను..

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనాత్మకమైన వార్త కథనాలతో వెలువడుతున్న డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక కు విలేకరులు కావలెను.అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత... కొత్త వారికి అవకాశం..

సంప్రదించండి: 8121158069

| పెద్దపల్లి | సోమవారం | 23 -02 -2026 | సంపుటి: 01 | సంచిక : 36 | పేజీలు : 08 | వెల :02/- |
|---|---|---|---|---|---|---|
| Peddapalli | Monday | 23 -02-2026 | Volume: 01 | Issue: 36 | Pages: 08 | Cost :02/- |



# నీటి హక్కుల్లో రాజీలేదు

- గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చిస్తాం.
- తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం.
- దేవాదుల ఎత్తిపోతల పథకంపై స్థల పరిశీలన, సమగ్ర సమీక్ష.
- రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం.

**జనం వాయిస్, ములుగు, ఫిబ్రవరి 22:**

గోదావరి నదీ జలాల వినియోగం, వాటిపై తలెత్తిన వివాదాలు, ప్రాజెక్టుల నిర్మాణం వంటి అన్ని అంశాలపై శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో సమగ్రంగా ఒకరోజు చర్చ నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని పునరుద్ఘాటించారు. నీటి హక్కుల విషయంలో అనవసర గందరగోళం సృష్టించవద్దని సూచించారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని జె.చొక్కారావు దేవాదుల



ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌ను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. ఇంజనీర్లతో మాట్లాడి ప్రాజెక్టు పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. దేవాదుల ఇంటేక్ -మిగతా 2 లో...

## సంఘీభావం తెలపడం

# నేరమా?

## రామచందర్ రావు అరెస్ట్ అప్రజాస్వామికం: ఈటెల రాజేందర్

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 22:**

కామారెడ్డికి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావును అరెస్ట్ చేయడం అప్రజాస్వామిక చర్య అని ఎంపీ ఈటెల రాజేందర్ మండిపడ్డారు. సొంత పార్టీ ఎమ్మెల్యేకు సంఘీభావం తెలపడానికి వెళ్లడమే నేరమా అని ప్రశ్నించారు. హౌస్ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఇలాంటి చర్యలతో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసిన పాలనను ప్రజలు ఎలా తిప్పికొట్టారో గుర్తుచేశారు. అదే విధానాలను ఇప్పుడు ప్రభుత్వం అనుసరిస్తోందని విమర్శించారు. అధికార పార్టీ నేతలు గుండాయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే దాడులను ప్రోత్సహిస్తోందని అన్నారు. సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులను హౌస్ అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజలు తగిన సమయంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వం తన చర్యలపై పునరాలోచించాలని ఈటెల రాజేందర్ సూచించారు.



# కౌన్సిలర్లకు హెచ్చరిక

- వార్డుల్లో తిరగండి.. సమస్యలు తీర్చండి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**జనం వాయిస్, ఖమ్మం, ఫిబ్రవరి 22:**

ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితమని, గెలిచిన తర్వాత ప్రజాసేవే లక్ష్యంగా పని చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు స్పష్టం చేశారు. ఆదివారం పెద్దతండాలోని మున్సిపల్ కార్యాలయంలో ఏదులాపురం నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత బాధ్యతల స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి కౌన్సిలర్లకు కఠిన



దిశానిర్దేశం చేశారు. ప్రతి కౌన్సిలర్ వారానికి ఐదు రోజులు, రోజుకు కనీసం రెండు గంటలు తమ వార్డుల్లో పర్యటించాలని -మిగతా 2 లో...

# ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు రాజీనామా చేయాలి

- కుమ్మెర ఘటనపై తీన్మార్ మల్లన్న ఆగ్రహం.
- బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటింపు.



2 లో

# "గాడ్స్ ఇన్ ది వాయిస్"

# టీజర్ ఆవిష్కరణ

- ఒగ్గు కథను ప్రపంచ వేదికపై ప్రతిష్టాత్మకంగా నిలబెట్టే ప్రయత్నం
- తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఘనంగా ప్రారంభం



2


## ఏపీలో దారుణం

- ఐదేళ్ల చిన్నారిపై అత్యాచార యత్నం.
- తూర్పుగోదావరి జిల్లా యాదవోలు గ్రామంలో ఘటన.
- నిందితుడిపై కేసు నమోదు.



# ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్.
- ఎమ్మెల్యే కాలే యాదయ్య సమక్షంలో నూతన పాలకవర్గం మర్యాదపూర్వక భేటీ.
- చైర్మన్ సోనియా దర్శన్, వైస్ చైర్మన్ రాజ్ ముదిరాజ్‌కు అభినందనలు.
- మొయినాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలి.



2

## స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర ప్రకటనలకే పరిమితం



2

గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

# నీటి హక్కుల్లో రాజీలేదు

-మొదటిపేజీ తరువాయి...

పాయింట్ వద్ద మోటార్లను పరిశీలించిన అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయడానికి నిధుల సమీకరణపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిపారు. నీటి వివాదాల విషయంలో మొదట రెండు రాష్ట్రాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వం, నదీ పరిపాలన బోర్డులు, ట్రిబ్యునళ్లు, సుప్రీంకోర్టు వరకు వెళ్లేందుకు సిద్ధమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నికర, మిగులు, వరద జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకుంటామని తెలిపారు. గత పదేళ్లలో ప్రాజెక్టుల నిర్లక్ష్యం వల్ల నష్టపోయామని, ఇకపై అలాంటి పరిస్థితి రానివ్వబోమని అన్నారు. రాష్ట్రంపై అప్పుల భారం ఉన్నప్పటికీ వచ్చే రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు తెలంగాణ ప్రజల ఆస్తి అని, వాటిని పునరుద్ధరించి ప్రజలకు ఉపయోగపడేలా చేస్తామని చెప్పారు. గోదావరి ప్రాజెక్టులను పూర్తి చేసి ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# కౌన్సిలర్లకు హెచ్చరిక

-మొదటిపేజీ తరువాయి...

ఆదేశించారు. కేవలం కుర్చీలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఉండాలని సూచించారు. “ప్రతి పనికి నిధులు అవసరం లేదు. మీరు బాధ్యతగా తిరిగితేనే అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగుపడుతుంది” అని వ్యాఖ్యానించారు.

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి ప్రకటించారు. తాగునీటి సమస్యలు, మురికినీటి నిల్వ, నాలాల కబ్జాలు వంటి అంశాలపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పదిహేను రోజుల్లో మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, అప్పటికి ప్రతి వార్డు సమస్యపై కౌన్సిలర్లు పూర్తి అవగాహనతో ఉండాలని హెచ్చరించారు. అనంతరం సత్యనారాయణపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడి గృహ ప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఏపీలో దారుణం

జనం వాయిస్, తూర్పుగోదావరి, ఫిబ్రవరి 22:

ఆంధ్రప్రదేశ్‌లో మరో దారుణ ఘటన వెలుగుచూసింది. ఐదేళ్ల చిన్నారిపై 70 ఏళ్ల వృద్ధుడు అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యాదవోలు గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపాలపురం మండలం గోపవరం గ్రామానికి చెందిన నేకూరి ఎలీసా అనే వృద్ధుడు ఒక రైతు వద్ద పొగాకు బ్యారెన్‌లో క్యూరింగ్ పనుల కోసం వచ్చాడు. సాయంత్రం సమయంలో బ్యారెన్ సమీపంలో ఆడుకుంటున్న ఐదేళ్ల బాలికను ఒంటరిగా చూసి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలిక ఏడుపు వినిపించడంతో సమీపంలో ఉన్న స్థానికులు అక్కడికి చేరుకుని ఘటనను అడ్డుకున్నారు. వెంటనే బాలికను రక్షించి గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్య పరీక్షల కోసం బాలికను ఆసుపత్రిలో చేర్పించినట్లు సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. బాలికకు అవసరమైన వైద్య సహాయం, మానసిక పరిరక్షణ కల్పిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రకటనలకే పరిమితం

జనం వాయిస్, నరసరావుపేట, ఫిబ్రవరి 22:

స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కేవలం ప్రకటనలకే పరిమితమైందని పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఆదివారం గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా స్థానిక 34వ వార్డు బీసీ కాలనీలో పర్యటించారు.

ఈ సందర్భంగా కాలనీలో ఏడాదిన్నరకు పైగా డ్రైన్లు శుభ్రం చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 600 మంది నివాసితులు పన్నులు చెల్లిస్తున్నప్పటికీ మౌలిక వసతులపై ఎవరూ దృష్టి సారించడం లేదని విమర్శించారు. డ్రైనేజీ సమస్యల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక వసతుల అభివృద్ధి వైయస్ హయాంలోనే జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం పాలకులు మాటల్లోనే అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాలనీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న డాక్టర్ గోపిరెడ్డి, ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



# ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు రాజీనామా చేయాలి

జనం వాయిస్, నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 22:

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో కుమ్మెర మల్లన్న స్వామి జాతర సందర్భంగా రజక సోదరులపై జరిగిన దాడిలో ఓ పసికందు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికార పార్టీ నేతలు స్పందించకపోవడం, బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో విఫలమవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రజల ముందుకు వచ్చి సమాధానం చెప్పాలని, అవసరమైతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణ భద్రతను కాపాడలేని నాయకత్వానికి పదవుల్లో ఉండే హక్కు లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన తీన్మార్ మల్లన్న, పార్టీ తరఫున రూ.2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఇది తక్షణ ఉపశమనం మాత్రమేనని, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. చిన్నారి మృతితో ఏర్పడిన లోటు ఎప్పటికీ నిండదని, కానీ న్యాయం జరిగే వరకు పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బాధితులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆయన, నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.



ఎఫ్ఐఆర్ నమోదు విధానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ డీఎస్పీతో వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. అనంతరం కాలినడకన కుమ్మెర గ్రామానికి వెళ్లి చిన్నారి సమాధి వద్ద నివాళులు అర్పించారు. నిందితులు తాళాలు వేసి పరారైనట్లు పేర్కొంటూ, ఎక్కడ ఉన్నా చట్టం ముందు నిలబెట్టే వరకు వెనక్కి తగ్గబోమని హెచ్చరించారు. కులం పేరుతో జరుగుతున్న దాడులు ఆగాలని, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# “గాడ్స్ ఇన్ ది వాయిస్” టీజర్ ఆవిష్కరణ



జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 22:

తెలంగాణ జాగృతి కార్యాలయంలో డాక్టర్ జి. కుమారస్వామి దర్శకత్వంలో రూపొందుతున్న “గాడ్స్ ఇన్ ది వాయిస్” డాక్యుమెంటరీ కల్చర్ ఫిల్మ్ టీజర్‌ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. తెలంగాణ సాంప్రదాయ కళారూపమైన ఒగ్గు కథను ప్రపంచ వేదికపై ప్రతిష్టాత్మకంగా నిలబెట్టే ప్రయత్నంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కల్వకుంట్ల కవిత, తెలంగాణ ఆత్మను, సంప్రదాయాలను, ఆధ్యాత్మిక మూలాలను ప్రతిబింబించేలా ఈ డాక్యుమెంటరీ రూపొందించ బడిందని తెలిపారు. ఒగ్గు కథ వంటి పౌరాణిక-జానపద కళారూపం కేవలం వినోదం మాత్రమే కాదని, అది తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. అలాంటి కళారూపాన్ని ఆధునిక మాధ్యమం ద్వారా ప్రపంచానికి చాటే ప్రయత్నం ప్రశంసనీయం అని అభిప్రాయపడ్డారు. డాక్టర్ జి. కుమారస్వామి ఈ ప్రాజెక్టును అత్యంత అంకితభావంతో రూపొందిస్తున్నారని, తెలంగాణ సంస్కృతి పరిరక్షణకు ఇది ఒక ముఖ్యమైన అడుగు అని పేర్కొన్నారు. డాక్యుమెంటరీని అద్భుతంగా తెరకెక్కిస్తున్న దర్శకుడితో పాటు మూవీ టీమ్ మొత్తాన్ని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రతినిధులు, కళారంగ ప్రముఖులు, సాంస్కృతిక కార్యకర్తలు పాల్గొన్నారు. “గాడ్స్ ఇన్ ది వాయిస్” డాక్యుమెంటరీ తెలంగాణ జానపద సంపదను అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేసే మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తమైంది.

# ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలి

జనం వాయిస్, చేవెళ్ల, ఫిబ్రవరి 22:

మొయినాబాద్ మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మొయినాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో నూతన పాలకవర్గానికి మంత్రి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ సోనియా



దర్శన్, వైస్ చైర్మన్ రాజ్ ముదిరాజ్‌లను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంతో మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు పదవిని అధికారంగా కాకుండా బాధ్యతగా భావించాలని మంత్రి హితవు పలికారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు సమన్వయంతో పనిచేయాలని నూతన పాలకవర్గానికి మంత్రి దిశానిర్దేశం చేశారు.

# పట్టణాభివృద్ధికి కట్టుబడి పనిచేయాలి

- మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసిన సత్తుపల్లి, కల్లూరు ప్రజాప్రతినిధులు
- నూతన మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు అభినందనలు
- ఖమ్మం క్యాంపు కార్యాలయంలో భేటీ

జనం వాయిస్, ఖమ్మం, ఫిబ్రవరి 22:

నూతనంగా ఎన్నికైన సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆదివారం ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని, పట్టణాల అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని మంత్రి సూచించారు. మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలను సమయానికి పరిష్కరించి విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే పట్టణాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని మంత్రి తెలిపారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలను సమర్థంగా అమలు చేసి ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# జనసేనలో భారీ చేరికలు

జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 22:

కూకట్‌పల్లి జనసేన పార్టీ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఘనంగా జనసేన పార్టీలో చేరారు. తెలంగాణ జనసేన పార్టీ ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ చేతుల మీదుగా గుండెల విజయకుమార్, కె. శ్రీను, ఏ. మహేష్, సి. నరేష్, ఎం. శ్రీనివాస్, వై. లక్ష్మి, వై. మల్లేష్, గుండెల పావని, ఆర్. ఆండాలు, బి. బాలమ్మ తదితరులు పార్టీ కండువాలు ధరించి సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా చేరికల నేతలు మాట్లాడుతూ జనసేన అధినేత, ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం, పారదర్శక రాజకీయాల కోసం జనసేనతో కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు మండపాక కావ్య, యువ నాయకుడు యడమ రాజేష్, నగర స్థానిక సంస్థల తాత్కాలిక కమిటీ సభ్యుడు మహేష్, రత్న సాయి తదితరులు పాల్గొన్నారు. జనసైనికుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.



RNI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్ తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# బీసీ ల పరిస్థితి రిజర్వేషన్...

బీసీ ల పై కమ్ముకున్న నీలి నీడలు ఇంకా ఎన్నాళ్లు రాజకీయ ప్రజాస్వామ్య ఫలాలు అందని ద్రాక్షలా మిగిలి పోక తప్పదా? రాష్ట్ర రాజకీయాలనే శాసించే స్థాయిలో ఉన్న బీసీ కులాల సంఖ్య ఎన్నికలనే శాసించే స్థాయిలో ఈ బీసీ జనసీకం ఇంకా ఎదుటకు ఇంకా ఎన్నాళ్ళు? ఎన్నికల హామీల ముసుగులో రాజకీయ పెద్దల వద్ద మోకరిల్లే పరిస్థితి రావడానికి కారణం ఏమిటి ? ఆర్థిక వృద్ధి లేకపోవటమా లేక చైతన్యం లేకపోవటమా? 55 శాతం ఉన్న బీసీ జనాభా కేవలం 4 శాతం ఉన్న అగ్ర వర్ణాల ఆధిపత్య పాలనలో ఒదిగి ఉండటం బీసీ కులాల అనైతికతకు నిదర్శనం 55 శాతం ఉన్న బీసీ కులాలకూ కేవలం 27 శాతం రిజర్వేషన్ ఎంతవరకు సమంజసం? వివిధ కులాలు వారి రిజర్వేషన్ గమనించినట్లు అయితే ఓసి వారు ఉన్న శాతం 5 వారికి కల్పించిన శాతం 10 . ఎస్సి వారు ఉన్న శాతం 12 వారికి కల్పించిన శాతం 15 . ఎస్టీ వారు ఉన్న శాతం 9 వారికి కల్పించిన శాతం 10. ఇక బీసీ వారు ఉన్న శాతం 55 కానీ వారికి కల్పించిన శాతం కేవలం 27 శాతం మాత్రమే అంటే మిగతా కులాల లకు వారు ఉన్న జనాభా శాతం కన్నా ఎక్కువ గా రిజర్వేషన్ సదుపాయం ఉంటే బీసీ లకు మాత్రం ఉన్న జనాభా లో దాదాపు సగం వరకు మాత్రమే రిజర్వేషన్ సదుపాయం ఉంది ఇది ఎంతటి అన్యాయం. విద్యా, ఉద్యోగం, సంక్షేమం, ఆర్థిక నిధులు పంపకాల విషయాలలో తీవ్ర అణిచివేతకు గురి అవుతున్న బీసీ ఉన్నతికి అభివృద్ధి దారులు దొరికేది ఎన్నడు? ఎన్నికలు రాగానే బహుజన నినాదంతో హామీల వర్షం కురిపిస్తూ బీసీ ల ఉన్నతే మా ఎజెండా అని బూటకపు మాటలతో వలలు పన్నే రాజకీయ పార్టీల ఉచ్చులో పడి సతమవుతున్న బీసీ ల ఉన్నతికి ప్రగతి మోక్షం ఎప్పుడూ? ఈ తరహా పరిస్థితులకు రాజకీయ పార్టీల చదరంగమా లేక వారి మేధో సంపత్తి ఆ లేక బీసీల అనైక్యత నా ? రాజ్యాంగ బద్ద పదవులలో గానీ నామినేటెడ్ పదవులలో గానీ రాజకీయ పదవులలో గానీ బీసీలకు జరుగుతున్న తీవ్ర అన్యాయానికి మోక్షం ఎప్పుడూ ? బీసీ కులాల మధ్య ఐక్యత లేకపోవడం అవగాహన లేమి కొంత వరకు బీసీలు వెనుకబాటు పడుటకు ఒక కారణం.

**బీసీలు చైతన్యవంతులు అయితే**

కదం తొక్కి పిడికిలై వృద్ధి కాంక్షతో ఎరుపెక్కితే దిగిరాదా పెత్తనం మూగబోయిన గొంతుకలు గొంతు ఎత్తితే బూటకపు హామీలపై కాదా గొడ్డలి పెట్టు సద్ది మూటలు కట్టిన బీసీ బిడ్డలు సప్పుడు చేస్తే సచివాలయ పార్లమెంట్ కుర్చీలు కూర్చుందునా ఉగ్గుపాలు తాగిన బీసీ బిడ్డలకు ఉగ్ర రూపం దాల్చడం ఎంత చైతన్యం లేక సంచరిస్తున్న బీసీ బిడ్డలు ఉత్తేజం అయితే తప్పదు మరొక కురుక్షేత్రం. బీసీ బిడ్డలు అభిమన్యుని వీరత్వం పొందిన వారసులు.

అసంపూరిత అమలుకు నోచుకొని అరకొర హామీలతో బీసీలను మోసం చేయకుండా వారికి ఇవ్వవలసిన రాజ్యాంగ బద్ధమైన రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించి బీసీల ఉన్నతికి పురోగతికి తోడ్పడేలా చర్యలు తీసుకొని అన్ని రంగాలలో బీసీలకు అవకాశాలు అందేలా చేసి బీసీల ఆర్థిక సంక్షేమ వృద్ధి పై చర్యలు తీసుకొనే బాధ్యత కచ్చితంగా ప్రభుత్వాలపై ఎంతైన ఉంది...

గోరుపాటి శంకర్.
(కవి, రచయిత & జర్నలిస్ట్)
ఎం. ఏ తెలుగు. ఉస్మానియా యూనివర్సిటీ.
చరవాణి నెంబర్ : 8179885282



# టెన్త్ టెన్షన్ వద్దు!



తెలుగు రాష్ట్రాలలో త్వరలో ప్రారంభం కానున్న పదవతరగతి పరీక్షలు . విద్యార్థి దశలో కీలకమైన ఘట్టం.విద్యార్థులు మొదటి సారిగా రాసే బోర్డు ఎగ్జామ్ ఈ పరీక్షలు, విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే దశగా కూడా వీటిని పరిగణించవచ్చు ,ఈ దశలో చాలా మంది విద్యార్థులు ఒత్తిడికి లోనై ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి ఆందోళన చెందుతుంటారు, సరైన క్రమశిక్షణ, ఏకాగ్రతతో, ప్రణాళిక బద్దంగా చదివితే విద్యార్థులు మంచి ఫలితాలను పొందవచ్చు .

**పరీక్షలకు సిద్ధం అవ్వాల్సిన విధానం**

**సమయ పాలన:** ప్రతిరోజు చదువుకోవడానికి ఒక సమయ పట్టిక రూపొందించుకోవడం , ముఖ్యమైన పాఠాలకు ఎక్కువ సమయం కేటాయించి ప్రతీ విషయం సమగ్రంగా చదవాలి, చదేవే సమయంలో చిన్న చిన్న విరామాలు తీసుకోవడం ద్వారా మానసిక ఉల్లాసాన్ని పొందడం,

పరీక్షా సమయంలో సెల్ ఫోన్, టీవీ, కంప్యూటర్ వంటి వాటి వైపు దృష్టి మరల్చకుండా చూసుకోవాలి..

**సిలబస్ పై పూర్తి అవగహన:** పరీక్షల ముందు సిలబస్ ను పూర్తిగా అధ్యయనం చేయాలి, ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి, గత సంవత్సరాల ప్రశ్నా పత్రాలను పరిశీలించి తరువాత వచ్చే ప్రశ్నలను అంచనా వేసుకోవాలి

**ఆరోగ్యకరమైన జీవనశైలి:** సమయానుగుణంగా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ఉదయాన్నే యోగ, వ్యాయామ వంటివి చేయడం మానసిక , ప్రతీ రోజు కనీసం 6-8 గంటలు నిద్రపోవడం వంటివి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి ఒత్తిడిని తగ్గిస్తాయి..

**నోట్స్ తయారి & రివిజన్:** స్వతహాగా ముఖ్యమైన అంశాలపై చిన్న నోట్స్ తయారు చేసుకోవడం చదవడాన్ని మరింత సులభతరం చేస్తుంది, చివరి నిమిషం వరకు కొత్త విషయాలు చదవకుండా రివిజన్ పై దృష్టి పెట్టాలి..

**ప్రశాంతంగా వుండండి:** సరైన సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవడం, పరీక్షా హాలులో

**పరీక్షా సమయంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలు.**

ఆత్మవిశ్వాసంతో వుండడం,ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా చదివి, ఏ ప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలో నిర్ణయించుకోవాలి

సమయాన్ని సరిగ్గా వినియోగించుకోవడం : మొదట సులభమైన ప్రశ్నలకు సమాధానం రాయడం ద్వారా సమయాన్ని పొదుపు చేసుకోవాలి, హడావుడిగా కాకుండా ప్రశాంతంగా రాయడం వల్ల తప్పులను తగ్గించుకోవచ్చు

**చేతి రాత, ప్రదర్శన:** మూల్యాంకన చేసే వారికి చిరాకు తెప్పించకుండా ఉండాలి అన్నా, మీకు మంచి మార్కులు రావాలన్న చేతి రాతే కీలకం, మీరు రాసేది స్పష్టంగా, అర్థమయ్యే విధంగా ఉండాలి, ముఖ్యమైన విషయాలను హైలెట్ చేయటం, శీర్షికలు, ఉపశీర్షకలు పెట్టడం, కొట్టివేతలు, తప్పులు లేకుండా చూసుకోవడం వంటివి మంచి ఫలితాలను ఇస్తాయి..

సమాధానాల పునఃపరిశీలన : సమయం మిగిలివుంటే సమాధానాలను మళ్ళీ చదివి

## ముందుంది పరీక్షా కాలం.

### ఒత్తిడిని అదిగమిస్తేనే అనుకున్నది సాధిస్తారు

తప్పులను సరిదిద్దుకోవాలి , హడావుడి చేయకుండా ప్రశాంతంగా రాయడం ఎంతో ముఖ్యం..

ఈ సమయంలో పిల్లలకు కావలసింది ర్యాంకుల ఒత్తిడి కాదు మీ ప్రోత్సాహం..

పక్కవారి తో మీ పిల్లలతో పోల్చవద్దు, వారి చిన్న చిన్న విజయాలను కూడా ప్రోత్సహించండి,ఇంట్లో

**తల్లిదండ్రులు గుర్తుంచుకోవాల్సింది**

ప్రశాంత వాతావరణం కల్పించండి.

పిల్లల ఆత్మవిశ్వాసం పెరిగితే, వారు అద్భుతాలు సృష్టిస్తారు.

పరీక్షల అనంతరం ఫలితాల గురించి ఆందోళన చెందకుండా ఎం నేర్చుకున్నాం అన్న దానిపై దృష్టి పెట్టాలి, అలాగే ఇష్టమైన ఆటలు ఆడటం, నచ్చిన ప్రదేశాలకు వెళ్లడం, విశ్రాంతి తీసుకోవడం ఎంతైనా మంచిది..

మీ ఆసక్తిని బలాన్ని గుర్తించి తర్వాత ఏ కోర్సు చేయాలో మీ తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సలహాలు తీసుకోవడం ఎంతో అవసరం..

పదవ తరగతి పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమే కానీ అవి అంతిమ లక్ష్యం కాదు, కేవలం మార్కుల కోసమే కాకుండా నీ మీద నీకు నమ్మకాన్ని కలిగించేలా భవిష్యత్తో నిన్ను ఉన్నతంగా నిలిపేలా నీ ప్రయత్నము ఉండాలి,

సరైన ప్రణాళిక, ధైర్యం మరియు సమయ పాలనలతో పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను పొందవచ్చు..

**అభ్యాసమే ఆయుధం, ఆచరణనే విజయ రహస్యం.**

**ఆత్మవిశ్వాసంతో ప్రయత్నించు, అనుకున్నది సాధించు.**



జి. అజయ్ కుమార్
96764 04318

# ఎడిటోరియల్

## రాజకీయాల్లో డబ్బు ప్రభావం ప్రమాదకరం?

- ప్రజాస్వామ్య ఆత్మను దెబ్బతీస్తున్న ఆర్థిక ఆధిపత్యం
- ఎన్నికల వ్యయాల విపరీత పెరుగుదల సమాన అవకాశాల క్షీణత
- విధాన నిర్ణయాలపై ఆర్థిక ప్రయోజనాల నీడ
- పారదర్శకత, నైతికత లేకుంటే ప్రజా నమ్మకానికి సంక్షోభం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు శక్తి అత్యంత గొప్పది. ప్రజలే పాలకులను ఎన్నుకుంటారు. కానీ ఆ ప్రక్రియపై డబ్బు ప్రభావం పెరిగిన కొద్దీ ప్రజాస్వామ్య ఆత్మ దెబ్బతింటోందన్న ఆందోళన పెరుగుతోంది. ఎన్నికలు ప్రజా సేవకుల ఎంపికకు వేదిక కావాలి. అయితే అవి భారీ ఖర్చుల పోటీలుగా మారుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో డబ్బు ప్రభావం ఎంత పెరిగితే ప్రజల నిర్ణయ స్వేచ్ఛ అంతగా సంకుచితమవుతుందనే ప్రశ్న ఇప్పుడు మరింత ప్రాసంగికమైంది.

ఎన్నికల సమయంలో ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రచార ర్యాలీలు, ప్రకటనలు, సామాజిక మాధ్యమాల ప్రచారం, ప్రచార వాహనాలు, కార్యాలయాలు ఇవి అన్నీ భారీ వ్యయంతో సాగుతున్నాయి. ఆర్థికంగా బలమైన అభ్యర్థులు మాత్రమే పోటీలో నిలబడగల పరిస్థితి ఏర్పడితే సామాన్యులకు రాజకీయాల్లో ప్రవేశం కష్టమవుతుంది. ఇది సమాన అవకాశాల సూత్రాన్ని దెబ్బతీస్తుంది. ప్రజాస్వామ్యం ధనికుల పోటీ వేదికగా మారే ప్రమాదం ఉంది.

డబ్బు ప్రభావం కేవలం ఎన్నికలకే పరిమితం కాదు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆర్థిక ప్రయోజనాల ప్రభావం పాలనపై కనిపించే అవకాశముంది. ఎన్నికల సమయంలో భారీగా ఖర్చు చేసినవారు ఆ వ్యయాన్ని తిరిగి పొందాలనే ప్రయత్నం చేస్తారన్న అభిప్రాయాలు ప్రజల్లో ఉన్నాయి. ఇది విధాన నిర్ణయాల్లో పారదర్శకతను దెబ్బతీస్తుంది. ప్రజా ప్రయోజనాల కంటే వ్యక్తిగత లేదా వర్గ ప్రయోజనాలు ముందుకు వచ్చే ప్రమాదం ఉంటుంది.

రాజకీయ పార్టీల నిధుల సేకరణపై స్పష్టత లేకపోవడం కూడా ఒక సమస్య. ఎవరు ఎంత విరాళం ఇస్తున్నారు? ఆ నిధులు ఎలా వినియోగిస్తున్నారు? అన్న విషయాల్లో పూర్తి పారదర్శకత అవసరం. లేకపోతే ఆర్థిక శక్తులు రాజకీయ నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. ఇది ప్రజాస్వామ్య నైతికతకు ముప్పు.

సామాజిక మాధ్యమాల యుగంలో ప్రచారం మరింత ఖరీదైనదిగా మారింది. సమాచారం వేగంగా వ్యాపిస్తున్నప్పటికీ దాన్ని ప్రభావితం చేయడానికి పెద్ద ఎత్తున ఖర్చులు చేస్తున్నారు. ప్రచారంలో డబ్బు ఆధిపత్యం పెరిగితే ప్రజాభిప్రాయం కూడా దానికి లోనయ్యే ప్రమాదం ఉంది. నిజమైన అంశాల కంటే ప్రకటనల ప్రభావం ఎక్కువగా మారితే ప్రజాస్వామ్య చర్చ బలహీనపడుతుంది.

డబ్బు రాజకీయాల్లో పూర్తిగా తొలగించడం సాధ్యం కాకపోయినా, దాని ప్రభావాన్ని నియంత్రించడం సాధ్యం. ఎన్నికల ఖర్చులపై కఠిన నియంత్రణలు, పారదర్శక నిధుల వ్యవస్థ, స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థలు అవసరం. ప్రజలు కూడా చైతన్యంతో వ్యవహరించాలి. డబ్బు ప్రలోభాలకు లోనుకాకుండా అభ్యర్థుల సామర్థ్యం, నైతికత, ప్రజా సేవా దృక్పథాన్ని ఆధారంగా తీసుకుని నిర్ణయం తీసుకోవాలి. రాజకీయాల్లో డబ్బు ప్రభావం పెరిగితే యువతలో రాజకీయాలపై నమ్మకం తగ్గే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం బలహీనపడితే అది దేశ భవిష్యత్తుకు హానికరం. ప్రజల నమ్మకమే ప్రజాస్వామ్యానికి మూలాధారం. ఆ నమ్మకాన్ని కాపాడటానికి రాజకీయ వ్యవస్థ స్వీయ సంస్కరణకు సిద్ధపడాలి. మొత్తంగా రాజకీయాల్లో డబ్బు ప్రభావం నియంత్రణలో లేకపోతే ప్రజాస్వామ్యానికి దీర్ఘకాలిక ముప్పు. సమాన అవకాశాలు, పారదర్శకత, నైతికత, ప్రజా బాధ్యత ఇవి బలపడితేనే ప్రజాస్వామ్యం ఆరోగ్యంగా ఉంటుంది. డబ్బు ఆధిపత్యం తగ్గి విలువల ఆధిపత్యం పెరిగితేనే ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడుతుంది. అదే సమాజం ఆశించే మార్గం. పారదర్శకత లేకపోవడం మరో సమస్య. పార్టీ నిధులు ఎలా సమకూరుతున్నాయి, ఎంత ఖర్చవుతోంది, ఎక్కడ ఖర్చవుతోంది అన్న అంశాలపై స్పష్టత లేకపోతే ప్రజల్లో అనుమానాలు పెరుగుతాయి. నిధుల సేకరణ, వినియోగం పై కఠిన నియంత్రణలు అవసరం. పారదర్శక వ్యవస్థల ద్వారా మాత్రమే ప్రజా నమ్మకం బలపడుతుంది.

సోషల్ మాధ్యమాలు, ప్రకటనల యుగంలో ప్రచార ఖర్చులు మరింత పెరిగాయి. సమాచార యుద్ధంలో ముందుండేందుకు భారీ వనరులు అవసరమవుతున్నాయి. దీని వల్ల రాజకీయ పోటీ సమాన స్థాయిలో జరగకపోవచ్చు. ఆర్థిక శక్తి ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే స్థితి ఏర్పడితే ప్రజాస్వామ్య విలువలు బలహీనపడే ప్రమాదం ఉంది.

అయితే డబ్బు పూర్తిగా రాజకీయాల నుంచి దూరం కావడం సాధ్యం కాదు. కానీ దాని ప్రభావాన్ని నియంత్రించవచ్చు. ఎన్నికల ఖర్చులపై కఠిన పరిమితులు, పారదర్శక నిధుల వ్యవస్థ, స్వతంత్ర పర్యవేక్షణ సంస్థలు వంటి చర్యలు అవసరం. ప్రజలు కూడా చైతన్యంతో ఓటు హక్కును వినియోగించాలి. డబ్బు ప్రలోభాలకు లోనుకాకుండా అభ్యర్థుల సామర్థ్యం, నైతికత ఆధారంగా నిర్ణయం తీసుకోవాలి.

మొత్తంగా రాజకీయాల్లో డబ్బు ప్రభావం నియంత్రణలో లేకపోతే ప్రజాస్వామ్యానికి ముప్పు. సమాన అవకాశాలు, పారదర్శకత, నైతిక పాలన వంటి విలువలను కాపాడేందుకు సమిష్టి కృషి అవసరం. ప్రజాస్వామ్యం బలపడాలంటే ప్రజల విశ్వాసం నిలవాలి. ఆ విశ్వాసాన్ని కాపాడటం రాజకీయ వ్యవస్థ ముందున్న అతిపెద్ద బాధ్యత.

డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM
RNI NO:TGTEL/26/A0383
www.janamvoice.com
epaper.janamvoice.com
సోమవారం
23- 02 - 2026


## ముని్సపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఘన సత్కరించిన
# జమ్మికుంట మెడికల్ అసోసియేషన్

**జనం వాయిస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలో కొత్తగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ 21వ వార్డు సభ్యుడు లను చింతల శ్రీను జమ్మికుంట మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధి, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నూతన ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. పట్టణంలో వైద్య సదుపాయాల మెరుగుదల, పారిశుద్ధ్యం, డ్రైనేజ్ వ్యవస్థ, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ సభ్యులు, మెడికల్ షాప్ లో యజమాను మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.




# జమ్మికుంట ప్రెస్ క్లబ్ లో చైర్మన్, వైస్ చైర్మన్ లకు ఘన సన్మానం.

**- వర్కింగ్ జర్నలిస్టు సమస్యను పరిష్కరిస్తాం.**
**- జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ల హామీ**

**జనం వాయిస్, జమ్మికుంట:**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో మునిసిపాలిటీ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), వైస్ చైర్మన్ ముంతాజ్ ఆలీ (జావిద్) లకు స్థానిక తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు. సౌడమల్ల యోహాన్, ఏ బూసి సంపత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు . ఈ సందర్భంగా చైర్మన్ వైస్ చైర్మన్ లు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నా వంతు కృషి చేస్తాను,ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. స్థానిక ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైన తమ దృష్టికి తీసుకురావాలని స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూపతి సంతోష్, జిల్లా నాయకులు ఖాజా ఖాన్, టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు కందుకూరి రాజు, అంబాల రాజు, కొక్కుల శ్రీరామ్, రచ్చ రవి కృష్ణ, గుండా రాజేంద్రప్రసాద్, జర్నలిస్టు ,ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# భారత విద్యా ప్రదాత మౌలానా ఆజాద్

**- యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి సజ్జాద్ మొహమ్మద్**

**జనం వాయిస్, జమ్మికుంట:**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో ఆదివారం రోజున మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి వేడుకలు యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు మొహమ్మద్ దౌలత్ పాషా ఆధ్వర్యంలో పూలదండ వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి సజ్జాద్ మొహమ్మద్ మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ స్వతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి అఖిలభారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అతి చిన్న వయసులో బాధ్యతలు చేపట్టి తనదైన శైలిలో స్వాతంత్ర ఉద్యమాన్ని ఉదృతపరిచి నాడు స్వాతంత్ర తర్వాత భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా నెహ్రూ క్యాబినెట్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చి దేశం ఈరోజు ఇంత అభివృద్ధిలో ఉందంటే నాడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వేసిన బీజమే అని గర్వంగా చెప్పుకోవచ్చు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి సలీం, యూత్ కాంగ్రెస్ హుజరాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాతకాల రమేష్, చీూఖ× కరీంనగర్ జిల్లా కార్యదర్శి అజ్మత్, స్టార్ రఫీ, అయ్యూబ్, పాషా, సల్లు బాబా, అశ్రఫ్, హాజీ, రషీద్, జావీద్, అహ్మద్, ఫాకురుద్దీన్, గఫ్ఫార్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ శ్రీ అయ్యప్ప స్వామి సేవార్తిఐక్యవేదిక రాష్ట్రఉపాధ్యక్షులుగా సిరిమల్లె జయేందర్ స్వామి

- **జమ్మికుంటకు గౌరవ కిరీటం.**
- **సేవా సంకల్పంతో ముందుకు ఐక్యవేదిక.**



**జనం వాయిస్, జమ్మికుంట:**


జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక సేవకుడు, జమ్మికుంట అయ్యప్ప స్వామి సేవా సమితి అధ్యక్షులు సిరిమల్లె జయేందర్ స్వామి ని తెలంగాణ రాష్ట్ర స్థాయి ఆధ్యాత్మిక వేదిక అయిన తెలంగాణ శ్రీ అయ్యప్ప స్వామి సేవార్తి ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జిల్లాలోని అయ్యప్ప భక్తుల్లో ఆనందోత్సాహాలను నింపింది. ఇటీవల హైదరాబాద్ నగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో నూతన కమిటీని ఘనంగా ఏర్పాటు చేయగా, అందులో భాగంగా జయేందర్ స్వామి కి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి అప్పగించడం విశేషంగా నిలిచింది.

ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అయ్యప్ప స్వామి సేవా సమితుల ప్రతినిధులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, సేవాదారులు హాజరై ఐక్యవేదిక భవిష్యత్ కార్యాచరణపై విస్తృత చర్చలు జరిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా వాకిటి భాస్కరరావు , ఉపాధ్యక్షులుగా సిరిమల్లె జయేందర్ స్వామి తో పాటు కటకం మల్లేశం, రాంచందర్ , తుమ్మల నాగేంద్రప్రసాద్, రుద్రగోని వెంకటేశం గౌడ్ ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా దురుగు మహంతి మోహన్ రావు , కోశాధికారిగా వివిఆర్‌వి ప్రసాద్ ని ఎన్నుకుని పూర్తి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయాల కార్యవర్గాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమన్వయంతో సేవా కార్యక్రమాలను నిర్వహించడం తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అయ్యప్ప స్వామి దీక్షాధారుల సౌకర్యార్థం ప్రత్యేక సేవా కార్యక్రమాలు, అన్నదానాలు, వైద్య శిబిరాలు, భక్తుల శిక్షణా శిబిరాలు, యువతకు ధార్మిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే హిందూ ధర్మ పరిరక్షణ, సాంప్రదాయ విలువల పరిరక్షణ, ఆలయాల అభివృద్ధి, భక్తుల ఐక్యత కోసం ఐక్యవేదిక పలు ప్రణాళికలను సిద్ధం చేస్తోందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అయ్యప్ప స్వామి ఆలయాల మధ్య పరస్పర సహకారం పెంపొందించి, ప్రతి జిల్లాలో సేవా విస్తరణకు కృషి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన జయేందర్ స్వామి మాట్లాడుతూ, "ఇది నాకు వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, జమ్మికుంట పట్టణానికి వచ్చిన గౌరవం. భక్తుల ఆశీస్సులు, పెద్దల మార్గదర్శకత్వంతో రాష్ట్రవ్యాప్తంగా అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తాం" అని తెలిపారు. ఆదివారం జమ్మికుంటలో జరిగిన సన్మాన కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది. అయ్యప్ప స్వామి సేవా సమితి సభ్యులు, భక్తులు, పట్టణ ప్రముఖులు కలిసి జయేందర్ స్వామి కి పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పలువురు భక్తులు మాట్లాడుతూ జయేందర్ స్వామి సేవా తపన, వినయం, సంఘటిత నాయకత్వం కారణంగానే ఈబాధ్యత దక్కిందని కొనియాడారు. ఈ సందర్భంగా భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ "స్వామియే శరణం అయ్యప్ప" నినాదాలతో కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా ముగించారు. జమ్మికుంట నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగిన జయేందర్ స్వామి ఎంపిక స్థానిక భక్తులకు ప్రేరణగా నిలుస్తూ, సేవా మార్గంలో మరిన్ని కార్యక్రమాలకు దారి చూపుతుందని సభ్యులు అభిప్రాయపడ్డారు.. ఈ కార్యక్రమంలో ఏ రాజేంద్రప్రసాద్. సామల ప్రతాప్ రెడ్డి. ఇమ్మడి భాస్కర్.. దామోదర్ వెంకట్ రెడ్డి. మురళి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పి.ఎస్.కె ఫౌండేషన్ చైర్మన్ పొనగంటి సాత్విక్ పటేల్ జన్మదిన వేడుకలు

**జనం వాయిస్,జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని శ్రీ సత్యసాయి మానసిక వికలాంగుల పాఠశాలలో పి.ఎస్.కె ఫౌండేషన్ చైర్మన్ పొనగంటి సాత్విక్ పటేల్ తన జన్మదిన వేడుకలను మానసిక వికలాంగుల పాఠశాలలో జరుపుకున్నారు. పి.ఎస్.కె ఫౌండేషన్ ద్వారా మానసిక వికలాంగుల పాఠశాలలో నూతనంగా టాయిలెట్స్ ను కట్టించి తన జన్మదినం సందర్భంగా ఈరోజు తన తండ్రి అయిన పొనాటి సంపత్ చేతుల మీదుగా ప్రారంభించారు. పి.ఎస్.కె ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు ఒక లక్ష మంది నిరుపేద కుటుంబాల ఆకలి తీర్చడం అదేవిధంగా




విద్యార్థులకు బుక్స్ తదితర విద్యకు సంబంధించిన సామాగ్రిని ఏర్పాటు చేయడం పై తన తండ్రి అయిన పొనగంటి సంపత్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా యువత ఒక మంచి త్రోవలో వెళ్లాలని తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని సమాజంలో జనన మరణాలు సహజం మనకు జన్మనిచ్చినటువంటి తల్లిదండ్రులకు మనం ఏదో ఒక విధంగా మంచి పేరును తీసుకురావడం ప్రతి ఒక్క యువకుడి బాధ్యత. సమాజంలో నిత్యం ఎన్నో రూపాయలను ఖర్చు చేస్తూ ఉంటాం ఇలాంటి ఒక ఫౌండేషన్ ద్వారా పదిమంది నిరుపేద కుటుంబాల ఆకలి తీర్చడం చాలా గొప్ప కార్యక్రమాన్ని నా కుమారుడైన పొనగంటి సాత్విక్ పటేల్ చేయడం నాకు చాలా గర్వకారణం అని మీడియా ముఖంగా పొనగంటి సంపత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పొనగంటి మధు , శ్రీధర్ మరియు యువకులు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మైనార్టీలపై బీఆర్ఎస్ కపట ప్రేమ..

**- కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు ఎండి ఇమ్రాన్**

**జనం వాయిస్,హుజురాబాద్:**

ముస్లింల పట్ల ప్రేమ ఉందని చెప్పుకునే హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి లకు నిజంగా మైనార్టీలపై చిత్తశుద్ధి ఉంటే సిరిసిల్లలో మున్సిపల్ చైర్మన్ లేదా వైస్ చైర్మన్ పదవులు మైనార్టీలకు ఎందుకు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఎండి ఇమ్రాన్ ప్రశ్నించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ.. జమ్మికుంట పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ గెలిచి ఎస్సీ (జనరల్) చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ముస్లిం సోదరుడికి పదవి ఇచ్చామని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మాత్రం మైనార్టీ వర్గానికి ఆ అవకాశాన్ని ఎందుకు కల్పించలేదని నిలదీశారు.



"మీ నాయకుడు కేటీఆర్ కు మైనార్టీలపై ప్రేమలేదని మీరు బహిరంగంగా ఒప్పు కుంటున్నట్లేనా?" అని ప్రశ్నిం చారు. హుజురాబాద్ పట్టణ మున్సి పాలిటీలో కాంగ్రెస్ పార్టీ గెలిచిన ప్పటికీ, సీనియర్ మైనార్టీ నాయకులు ఉన్నప్పటికీ వైస్ చైర్మన్ పదవి ఇవ్వలేదని ఆరోపించే హక్కు ఎమ్మెల్యేకు లేదన్నారు. గత ఐదేళ్ల మున్సిపల్ పాలనలో కనీసం కో–ఆప్షన్ సభ్యుడిని కూడా నియమించలేని పరిస్థితిలో ఉన్న వారు ఇప్పుడు మైనార్టీలపై కాపట ప్రేమ నటించడం ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటుందనే ఆరోపణల్లో వాస్తవం లేదని ఇమ్రాన్ స్పష్టం చేశారు. మైనార్టీ సోదరులను గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నదే కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. రాజకీయ అవసరాల కోసం కులమతాలను వాడుకుని, అవసరం ముగిసిన తర్వాత మాట మార్చే నాయకులను ప్రజలు బాగా గమనిస్తున్నారని, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలకు భవిష్యత్తులో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఇమ్రాన్ పేర్కొన్నారు.

# ఆపద్బాంధవులుగా ఆలయ ఫౌండేషన్ సేవలు

**- పక్షవాతానికి గురైన వ్యక్తికి వీల్ చైర్ అందజేత**

**జనం వాయిస్, జమ్మికుంట:**

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం వల్బాపూర్ గ్రామానికి చెందిన యువ న్యాయవాది వీరవేన కుమార్ అనే వ్యక్తికి అనారోగ్యం కారణాలవల్ల ఆయనకు రెండు కాళ్లు పక్షవాతానికి గురై ఇంటికి పరిమితంఅయ్యాడు. చాలా బాధపడుతూ ఆర్థికంగా నష్టపోయి ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణ సాగర్ ను



సంప్రదించగా ఆలయ ఫౌండేషన్ మార్గదర్శకులు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ చెరువుతో కుమార్ కు ఆదివారం రోజు వీల్ చైర్ ను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్ నేత అందె కుమార్ జీడి వెంకటస్వామి మారముల్ల అంజి వీరవేన సమ్మయ్య రాజమోహన్ పల్లె బోయిన రాజ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బాబర్ ఆజం ఓపెనర్‌గా సరిపోడు.. మైక్ హెసన్ వ్యాఖ్యలు

టీ20 ప్రపంచకప్ సందర్భంగా పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజం బ్యాటింగ్ క్రమంపై పెద్ద చర్చ నడుస్తోంది. సాధారణంగా ఆరంభ బ్యాటర్‌గా బరిలోకి దిగే బాబర్‌ను ఈసారి నాలుగో స్థానంలో ఆడించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధాన కోచ్ మైక్ హెసన్ అసలు కారణాలను వెల్లడించారు. ప్రపంచకప్ పోటీల్లో ఆరంభ ఓవర్లలో బాబర్ పరుగుల వేగం వంద కంటే తక్కువగా ఉందని హెసన్ తెలిపారు. ఆధునిక టీ20 తరహాలో తొలి ఆరు ఓవర్లలో వేగంగా పరుగులు చేయడం అత్యంత ముఖ్యమని, ఆ దశలో దూకుడుగా ఆడే ఆటగాళ్లు అవసరమని చెప్పారు. జట్టు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బాబర్‌ను మధ్య వరుసలోకి మార్చినట్లు వివరించారు. ఆసియా కప్ తర్వాత బాబర్‌కు ప్రత్యేక పాత్ర కేటాయించామని, ఇన్నింగ్స్ కష్టాల్లో ఉన్నప్పుడు జట్టును నిలబెట్టగల సామర్థ్యం అతనికి ఉందని హెసన్ పేర్కొన్నారు. అయితే మధ్య దశలో వేగంగా పరుగులు చేయాల్సిన పరిస్థితుల్లో ఇతర దూకుడు ఆటగాళ్లు జట్టులో ఉన్నారని తెలిపారు. ఈ నిర్ణయం బాబర్‌పై బలవంతంగా తీసుకోలేదని, జట్టు మేలు కోసం అతడూ అంగీకరించాడని హెసన్ వెల్లడించారు. కొన్ని సందర్భాల్లో ఇతర ఆటగాళ్లు వేగంగా ఆడగలరని బాబర్ స్వయంగా అర్థం చేసుకున్నాడని చెప్పారు. ప్రస్తుతం పాకిస్థాన్ జట్టు సూపర్ 8 దశకు సిద్ధమవుతోంది. ఈ దశలో ఇదే బ్యాటింగ్ క్రమాన్ని కొనసాగిస్తారా, లేక బాబర్‌ను మళ్లీ ఆరంభ బ్యాటర్‌గా పంపిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. అభిమానులు మాత్రం తమ స్టార్ ఆటగాడిని మళ్లీ మొదటి స్థానంలో చూడాలని కోరుకుంటున్నారు.



# భారత్ మ్యాచ్ ఓటమికి జట్టు ఎంపికే కారణమా?

భారత్‌తో జరిగిన కీలక పోరులో పాకిస్థాన్‌కు ఎదురైన ఓటమిపై మాజీ వేగవంతమైన బౌలర్ షోయబ్ అక్తర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరాజయానికి ప్రధాన కారణం జట్టు ఎంపికలో జరిగిన లోపాలేనని ఆయన స్పష్టం చేశారు. సరైన కూర్పుతో జట్టును మైదానంలోకి దించలేకపోవడం వల్లే మ్యాచ్ ఫలితం ప్రతికూలంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. జట్టు నిర్వహణకు స్పష్టమైన ప్రణాళిక, దీర్ఘకాల వ్యూహం కనిపించలేదని విమర్శించారు. పాకిస్థాన్ జట్టుకు సరైన సమతుల్యత అవసరమని, పరిస్థితులకు అనుగుణంగా ఆటగాళ్లను ఎంపిక చేయడంలో పారదర్శకత ఉండాలని అక్తర్ సూచించారు. ప్రతిభావంతులైన ఆటగాళ్లు జట్టులో ఉన్నప్పటికీ, వారి సామర్థ్యాన్ని సరైన స్థానాల్లో వినియోగించకపోతే ఫలితాలు అనుకూలంగా రావని పేర్కొన్నారు. జట్టు ఎంపిక కచ్చితంగా జరిగితే పాకిస్థాన్ ఏ ప్రత్యర్థినైనా ఓడించే శక్తి కలిగి ఉందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో ఐసీసీ టోర్నీల్లో భారత్ ఎదుట పాకిస్థాన్ వరుస పరాజయాలు ఎదుర్కొంటున్నది గమనించదగ్గ విషయం. కీలక మ్యాచ్‌లలో ఒత్తిడిని తట్టుకోలేకపోవడం, జట్టు సమతుల్యత లోపించడం వంటి అంశాలు ప్రభావం చూపుతున్నాయని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా బ్యాటింగ్ క్రమం, బౌలింగ్ మార్పుల్లో స్పష్టత లేకపోవడం కూడా జట్టు ప్రదర్శనను దెబ్బతీస్తోందని వారు చెబుతున్నారు. సెమీఫైనల్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే పాకిస్థాన్ ఇంగ్లండ్, శ్రీలంక జట్లపై తప్పనిసరిగా విజయాలు సాధించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ మ్యాచ్‌లు వారికి జీవన్మరణ సమరంగా మారాయి. ఇకపై ప్రతి నిర్ణయం జాగ్రత్తగా తీసుకోవాలని, జట్టు కూర్పులో స్థిరత్వం తీసుకురావాలని అభిమానులు కోరుతున్నారు.



# చెన్నై జట్టునుంచి ధోనీ అభిమానులకు శుభవార్త



చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు ఇది నిజంగా సంతోషకరమైన వార్త. భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ వచ్చే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో కూడా ఆడనున్నట్లు జట్టు ప్రధాన కార్యనిర్వాహణ అధికారి కాశీ విశ్వనాథన్ స్పష్టంచేశారు. దీంతో గత కొంతకాలంగా ధోనీ భవిష్యత్తుపై సాగుతున్న ఊహాగానాలకు పూర్తిగా తెరపడింది. లీగ్ ప్రారంభానికి ముందు మీడియాతో మాట్లాడిన కాశీ విశ్వనాథన్, "ధోనీ ఈ సీజన్‌లో తప్పకుండా ఆడతాడు" అని వెల్లడించారు. ఈ ప్రకటనతో చెన్నై అభిమానుల్లో ఆనందం వెల్లివిరిసింది. 2008లో లీగ్ ఆరంభమైనప్పటి నుంచి ధోనీ చెన్నై జట్టుకు నాయకత్వం వహిస్తూ ఎన్నో విజయాలు అందించాడు. మధ్యలో జట్టుపై రెండేళ్ల నిషేధం ఉన్న సమయంలో మాత్రమే పుణే జట్టు తరపున బరిలోకి దిగాడు. 44 ఏళ్ల వయసులోనూ జట్టుకు మార్గనిర్దేశం చేస్తూ ఐదుసార్లు చెన్నైను విజేతగా నిలబెట్టిన ఘనత ధోనీదే. 2020లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటికీ, లీగ్ పోటీల్లో అతని ప్రభావం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఇటీవల వ్యాఖ్యాతగా మారే అవకాశాలపై స్పందిస్తూ, వ్యాఖ్యానం చేయడం సులభం కాదని, ఆటగాళ్లను విమర్శించకుండా మాట్లాడటం సవాలుతో కూడుకున్నదని పేర్కొన్నాడు. మార్చి చివర్లో ప్రారంభమయ్యే 2026 సీజన్‌లో ధోనీ మరోసారి మైదానంలో కనిపించనున్నాడన్న వార్తతో చెన్నై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అతని నిర్ణయంతో జట్టుపై ఆశలు మరింత పెరిగాయి.

# స్పిన్ వ్యూహానికి శ్రీలంక చిత్తు.. సూపర్ 8లో ఇంగ్లండ్ బోణీ..!



స్వదేశంలో స్పిన్ అస్త్రంతో ప్రత్యర్థులను దెబ్బతీయాలనుకున్న శ్రీలంకకు ఇంగ్లండ్ భారీ షాక్ ఇచ్చింది. పల్లెకెలె స్టేడియంలో జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో ఇంగ్లండ్ బౌలర్లు కట్టుదిట్టమైన ప్రదర్శనతో ఆతిథ్య జట్టును కట్టడి చేశారు. ముఖ్యంగా విల్ జాక్స్ మూడు వికెట్లతో లంక బ్యాటింగ్‌ను తిప్పికొట్టగా, ఆదిల్ రషీద్ కీలక సమయంలో రెండు వికెట్లు తీసి మ్యాచ్‌పై పట్టు బిగించాడు. 51 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన ఇంగ్లండ్ గ్రూప్ బీలో విజయ ఖాతా తెరిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ జట్టు శ్రీలంక స్పిన్నర్లను ఎదుర్కొంటూ పోరాడి గౌరవప్రదమైన స్కోరు సాధించింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ ఒత్తిడిలోనూ అద్భుత అర్ధశతకంతో జట్టును నిలబెట్టాడు. దునిత్ వెల్లలాగే, మహీష్ తీక్షణలు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఇంగ్లండ్ టాప్ ఆర్డర్‌ను కుదిపేశారు. అయినప్పటికీ చివర్లో విల్ జాక్స్, జేమీ ఓవర్టన్ వేగంగా పరుగులు సాధించడంతో నిర్ణీత ఓవర్లలో ఇంగ్లండ్ తొమ్మిది వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. 150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభం నుంచే ఎదురుదెబ్బలు తగిలాయి. ప్రమాదకర ఓపెనర్ పథుమ్ నిశాంకను జోఫ్రా ఆర్చర్ త్వరగా ఔట్ చేయడంతో లంక ఒత్తిడిలో పడింది. వెంటనే విల్ జాక్స్ తన స్పిన్ మాయాజాలంతో కుశాల్ మెండిస్, పవన్ రత్ననాయకే, దునిత్ వెల్లలాగేలను వెనక్కి పంపాడు. పవర్ ప్లే ముగిసే సరికి శ్రీలంక 34 పరుగులకే ఐదు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. సగం జట్టు వెనుదిరిగిన సమయంలో కెప్టెన్ దసున్ శనక పోరాడే ప్రయత్నం చేశాడు. కమిందు మెండిస్‌తో కలిసి భాగస్వామ్యం నెలకొల్పాలని చూశాడు. అయితే కీలక సమయంలో లియామ్ డాసన్, ఆదిల్ రషీద్ వికెట్లు తీసి లంక ఆశలు చెదరగొట్టారు. అవసరమైన పరుగుల రేటు పెరుగుతుండగా భారీ షాట్లు ఆడే క్రమంలో వికెట్లు కోల్పోయిన శ్రీలంక చివరకు 99 పరుగులకే ఆలౌటైంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఇంగ్లండ్ శ్రీలంకపై పూర్తి ఆధిపత్యం చాటింది. స్వదేశంలోనే పరాజయం పాలైన శ్రీలంకకు ఇది పెద్ద ఎదురుదెబ్బగా మారగా, సూపర్ 8లో ఇంగ్లండ్ బలమైన ఆరంభం చేసింది.

# భళా అమ్మాయిలు.. ఆసియా కప్ కొల్లగొట్టిన టీమిండియా..!




అంతర్జాతీయ క్రికెట్‌లో భారత మహిళల జట్టు మరోసారి తన సత్తా చాటింది. ఇప్పటికే హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో భారత్ మహిళల జట్టు వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించగా, తాజాగా రాధా యాదవ్ నాయకత్వంలోని భారత ఏ జట్టు మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ పోటీలో విజేతగా నిలిచింది. సెమీఫైనల్లో శ్రీలంకను చిత్తు చేసిన భారత అమ్మాయిలు ఫైనల్లో బంగ్లాదేశ్‌పై పూర్తి ఆధిపత్యం చాటుతూ ట్రోఫీని సొంతం చేసుకున్నారు. ఫైనల్ పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. అయితే తేజల్ హసబ్నిస్ అజేయంగా 51 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. కెప్టెన్ రాధా యాదవ్ 38 పరుగులతో కీలక పాత్ర పోషించింది. ఐదో వికెట్‌కు వీరిద్దరూ కలిసి 69 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టును గౌరవప్రదమైన స్కోరుకు చేర్చారు. నిర్ణీత ఓవర్లలో భారత్ 134 పరుగులు సాధించింది. 135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ జట్టు భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేకపోయింది. సైమా థాకోర్ ప్రారంభంలోనే ఇష్మా తంజిమ్ వికెట్ తీసి ఒత్తిడి పెంచింది. షమీమా సుల్తానాను వెనక్కి పంపిన ప్రేమా రావత్ మూడు వికెట్లు తీసి ప్రత్యర్థి మధ్య వరుసను కూల్చింది. రాధా యాదవ్ తన ఓవర్లో షర్మీన్ సుల్తానాను ఔట్ చేసి జట్టుకు మరింత ఊపు ఇచ్చింది. సదియా అక్తర్, లతా మొండల్‌లను కూడా ప్రేమా ఔట్ చేయడంతో మ్యాచ్ పూర్తిగా భారత్ వైపు మొగ్గుచూపింది. మరోవైపు తనూజ కన్వర్ రెండు వికెట్లు తీసి బంగ్లాదేశ్‌పై పట్టు బిగించింది. చివరికి బంగ్లాదేశ్ జట్టు 88 పరుగులకే కుప్పకూలింది. 46 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన భారత మహిళల జట్టు ఆసియా కప్ ట్రోఫీని అందుకుని అభిమానులను ఆనందంలో ముంచెత్తింది. వరుస విజయాలతో భారత మహిళల క్రికెట్ భవిష్యత్తుపై మరింత నమ్మకం పెరిగింది.

# సినిమా

## ఫిలింఫేర్ అవార్డు బెస్ట్ డెబ్యూ హీరోయిన్



టాలీవుడ్‌లో కొత్త ముద్దుగుమ్మల హవా స్పష్టంగా కనిపిస్తోంది. యంగ్ హీరోలు కొత్త హీరోయిన్స్‌తో సినిమాలు చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్న వేళ, తక్కువ కాలంలోనే మూడు విజయాలను అందుకుని అందరి దృష్టిని ఆకర్షించిన నటి నయన్ సారిక. తాజాగా ఆమె ఫిలింఫేర్ అవార్డ్స్‌లో ఉత్తమ తొలి నటి పురస్కారం అందుకోవడం ద్వారా మరింత చర్చనీయాంశమైంది. నయన్ సారిక సినీ ప్రయాణం ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన 'గం గం గణేషా' చిత్రంతో ప్రారంభమైంది. తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ యువ నటి, ఆ తర్వాత నార్ని నితిన్ నటించిన 'ఆయ్' చిత్రంలో నటించి మరో విజయాన్ని అందుకుంది. నటన పరంగా మంచి మార్కులు సాధించిన ఆమె, సహజమైన అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. 'ఆయ్' తర్వాత కిరణ్ అబ్బవరం హీరోగా తెరకెక్కిన 'క' చిత్రంలో కూడా నయన్ సారిక కీలక పాత్ర పోషించింది. విభిన్న కథాంశంతో రూపొందిన ఈ సినిమా విజయవంతం కావడంతో ఆమెకు వరుస విజయాలు దక్కాయి. మూడు సినిమాలు విజయవంతం కావడంతో నయన్ సారికను పరిశ్రమలో లక్కీ హీరోయిన్‌గా అభివర్ణిస్తున్నారు. ప్రస్తుతం ఈ అందాల భామ చేతిలో మరికొన్ని ఆసక్తికర ప్రాజెక్టులు ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, తాజా ఫిలింఫేర్ అవార్డ్స్‌లో ఉత్తమ తొలి నటి విభాగంలో అవార్డు అందుకోవడం ఆమె కెరీర్‌కు మరింత బలాన్నిచ్చింది. తక్కువ సమయంలోనే మంచి విజయాలు, అవార్డు దక్కించుకోవడం విశేషంగా చెప్పుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో పెద్దగా చురుకుగా లేకపోయినా, అప్పుడప్పుడూ తన ఫొటోలతో అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె ఫొటోలు నెట్టింట వైరల్ అవుతుండగా, అభిమానులు అభినందనల వర్షం కురిపిస్తున్నారు. వరుస విజయాలతో ముందుకు సాగుతున్న నయన్ సారిక భవిష్యత్తులో టాలీవుడ్‌లో మరింత స్థిరపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## నిరాశపర్చిన రాజాసాబ్.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి ప్రభాస్ మరో ఛాన్స్..!




గ్లోబల్ స్టార్ ప్రభాస్ ఇటీవల 'ది రాజా సాబ్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. టాలీవుడ్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రం భారీ అంచనాల మధ్య విడుదలైనప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధించలేకపోయింది. విజువల్‌గా ఆకట్టుకున్నప్పటికీ కథ, కథనం విషయంలో కొంతమంది ప్రేక్షకులు నిరాశ వ్యక్తం చేశారు. దీంతో ఈ సినిమా ఆ సంస్థకు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయిందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రభాస్ మరోసారి అదే బ్యానర్‌తో సినిమా చేసేందుకు సిద్ధమవుతున్నాడనే వార్తలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 'ది రాజా సాబ్' ఫలితం ఆశించినట్లు రాకపోయినా, నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌కు ప్రభాస్ మరో ప్రాజెక్ట్ చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. బాక్సాఫీస్ ఫలితాలను పక్కనబెట్టి నిర్మాతకు అండగా నిలవాలనే నిర్ణయం తీసుకోవడం ప్రభాస్ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తోందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభాస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కలయికలో రాబోయే ఈ కొత్త ప్రాజెక్ట్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని సమాచారం. అయితే ఈ చిత్రానికి దర్శకత్వం వహించబోయే దర్శకుడు ఎవరు? కథా నేపథ్యం ఎలా ఉండబోతోంది? అనే విషయాలపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రభాస్ స్టార్‌డమ్‌కు తగ్గట్టుగా, అభిమానులను ఆకట్టుకునే స్థాయిలో ఈ చిత్రం ఉండాలని సినీ ప్రియులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ ఖాతాలో 'సలార్ 2', 'ఫౌజీ', 'స్పిరిట్' వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో మళ్లీ కలిసే సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందన్నదానిపై ఆసక్తి నెలకొంది. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

## తాప్సీ పన్ను సంచలన వ్యాఖ్యలు



బాలీవుడ్, టాలీవుడ్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి తాప్సీ పన్ను తాజాగా దక్షిణాది చిత్ర పరిశ్రమపై చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. తన సినీ ప్రస్థాన ప్రారంభ దశలో ఎదుర్కొన్న కొన్ని చేదు అనుభవాలను ఆమె ఒక ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ముఖ్యంగా కొన్ని పాటల చిత్రీకరణ సమయంలో వేషధారణకు సంబంధించిన సూచనలు అందరి ముందూ ఇవ్వడం తనకు ఎంతో అసౌకర్యంగా అనిపించేదని వెల్లడించారు. పాటల చిత్రీకరణలో శరీర భాగాలపై అధికంగా దృష్టి పెట్టడం ఎందుకు అవసరమో అర్థం కాకపోయేదని ఆమె పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితులు ఇతర చిత్ర పరిశ్రమల్లో కూడా ఉన్నప్పటికీ, దక్షిణాదిలో తాను ఎక్కువగా అనుభవించానని చెప్పడం మరింత చర్చకు దారితీసింది. ఒక యువ నటి గా అందరి ముందూ వ్యక్తిగతంగా అనిపించే విషయాలు చెప్పడం చాలా ఇబ్బందిగా ఉండేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై పరిశ్రమలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమె నిజాయితీని అభినందిస్తుండగా, మరికొందరు ఈ వ్యాఖ్యలను వివాదాస్పదంగా చూస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం తాప్సీ పన్ను ప్రధాన పాత్రలో నటించిన 'అస్సీ' చిత్రం ఫిబ్రవరి 20న విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. విభిన్న కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్న ఆమె, తన అనుభవాలను బహిరంగంగా పంచుకోవడం ద్వారా చిత్ర పరిశ్రమలో మహిళల పని పరిస్థితులపై మరోసారి చర్చకు వేదిక కల్పించారు.

## ఉస్తాద్ భగత్‌సింగ్‌లో "ఉస్తాద్ ఔరా" పాట సంచలనం..




పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తున్న భారీ చిత్రమైన ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి విడుదలైన "ఉస్తాద్ ఔరా" పూర్తి గీతం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. దర్శకుడు హరీష్ శంకర్ రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. గీతం విడుదలైన వెంటనే సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాప్తి చెందుతూ ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది. "నేను మెడ ముట్టుకుంటే తొడగొట్టినట్టేడ జుట్టు ఎగురుతుంటే పిడుగులు పడినట్టేడ" అంటూ ప్రారంభమయ్యే ఈ గీతంలో పవన్ కల్యాణ్ ప్రత్యేక శైలి స్పష్టంగా కనిపిస్తోంది. అభిమానులు ఆశించే శక్తివంతమైన నృత్య కదలికలు, ఉత్సాహభరితమైన భావ వ్యక్తీకరణలు ఈ గీతాన్ని మరింత ఆకర్షణీయంగా నిలబెట్టాయి. గీత రచయిత చంద్రబోస్ రాసిన పదాలు సామూహిక ఉత్సాహాన్ని రగిలించేలా ఉన్నాయి. సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ స్వరపరిచిన ఈ గీతాన్ని ఆయన బృందం ఆలపించడం విశేషం. ఈ చిత్రంలో కథానాయికగా శ్రీలీల నటిస్తుండగా, కీలక పాత్రలో రాశీ ఖన్నా కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన మొదటి గీతం కూడా ప్రేక్షకాదరణ పొందగా, తాజాగా వచ్చిన "ఉస్తాద్ ఔరా" గీతం చిత్రంపై అంచనాలను మరింత పెంచింది.

గ్లింప్స్‌లో మహంకాళి పోలీస్‌స్టేషన్ నేపథ్యంలో పవన్ కల్యాణ్ పలికిన సంభాషణలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన గబ్బర్ సింగ్ భారీ విజయాన్ని సాధించడంతో, ఈసారి కూడా అదే స్థాయి విజయం సాధిస్తుందనే నమ్మకం అభిమానుల్లో కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని మార్చి 26న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

## ఇంతియాజ్ అలీ స్పష్టీకరణ.. కరీనా కపూర్‌తో మళ్లీ సినిమా ఎందుకు చేయలేదు?

బాలీవుడ్‌లో భావోద్వేగాలతో నిండిన ప్రేమకథలకు ప్రత్యేక శైలి అందించిన దర్శకుడు ఇంతియాజ్ అలీ. ఆయన దర్శకత్వంలో వచ్చిన 'జబ్ వీ మెట్' చిత్రం విడుదలై ఎన్నేళ్లు గడిచినా ఇప్పటికీ ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. రొమాంటిక్ కామెడీ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంలో కరీనా కపూర్, షాహిద్ కపూర్ జంటగా నటించారు. ముఖ్యంగా కరీనా కపూర్ పోషించిన గీత్ పాత్ర యువతలో అపారమైన ఆదరణ పొందింది. ఆ పాత్రలో ఆమె చూపిన ఉత్సాహం, చురుకుదనం, భావోద్వేగాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అయితే ఈ విజయవంతమైన కాంబినేషన్ తర్వాత ఇంతియాజ్ అలీ, కరీనా కపూర్ మళ్లీ కలిసి సినిమా చేయకపోవడం అభిమానుల్లో ఎప్పటికప్పుడు చర్చనీయాంశమవుతూనే ఉంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఈ విషయంపై స్పందించిన ఇంతియాజ్ అలీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జబ్ వీ మెట్' తరహాలో బలమైన కథ మళ్లీ



దొరకలేదని ఆయన స్పష్టం చేశారు. "నేను పలుమార్లు ఆలోచించాను. కానీ కరీనా కపూర్‌కు ప్రత్యేకంగా ఆఫర్ చేయాలనిపించేలా, ఆమెను సవాలు చేసేలా ఉండే పాత్ర నాకు దొరకలేదు. సరైన కథ లేకుండా కేవలం కాంబినేషన్ కోసం సినిమా చేయడం నేను ఇష్టపడను" అని తెలిపారు. ఒక మంచి కథ, పాత్రకు సరిపోయే సందర్భం ఉండాలని, లేదంటే ప్రేక్షకుల అంచనాలను అందుకోలేమని ఆయన అభిప్రాయపడ్డారు. 'జబ్ వీ మెట్' తర్వాత తన కెరీర్‌లో విభిన్న కథాంశాలతో సినిమాలు చేసినప్పటికీ, గీత్ లాంటి పాత్రకు సమానంగా నిలిచే పాత్ర రాలేదని ఆయన సూచించారు. అందుకే ఆ జంట మళ్లీ తెరపై కనిపించలేదని స్పష్టమైంది. ప్రస్తుతం కూడా మంచి కథ దొరికితే కరీనా కపూర్‌తో కలిసి పనిచేయడానికి తాను సిద్ధంగానే ఉన్నానని ఇంతియాజ్ అలీ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో అభిమానుల్లో మరోసారి ఆశలు చిగురించాయి. సరైన కథా బలం దొరికితే ఈ కల్ట్ జంట మళ్లీ వెండితెరపై కనిపించే రోజు దూరంలో ఉండకపోవచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## మా ఇంటి బంగారం విడుదల తేదీ ఖరారు

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదల తేదీ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని మే 15న వేసవి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. సుదీర్ఘ విరామం తర్వాత సమంత తెలుగులో నటిస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో ఆమె మధ్యతరగతి గృహిణి పాత్రలో కనిపించడమే కాకుండా, ఆకట్టుకునే యాక్షన్ సన్నివేశాల్లోనూ నటిస్తున్నట్లు సమాచారం. గతంలో 'ఓ బేబీ'తో విజయం సాధించిన నందిని రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సమంత తన స్వంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కథను రాజ్ నిడిమోరు అందించగా, సంగీతాన్ని సంతోష్ నారాయణన్ సమకూరుస్తున్నారు. గుల్షన్ దేవయ్య, దిగంత్, గౌతమి, శ్రీముఖి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సమంత తన సామాజిక మాధ్యమ వేదికలో కొత్త పోస్టర్‌ను పంచుకుంటూ "యాక్షన్‌తో నిండిన గోల్డెన్ హంట్ ఈ వేసవిలో థియేటర్లలో కలుద్దాం" అని పేర్కొనడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. వేసవి సెలవులను లక్ష్యంగా చేసుకుని వస్తున్న ఈ చిత్రం సమంత కెరీర్‌లో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.




Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, DYNAMIC JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: honeyassociatesmnt@gmail.com